క్లుప్తంగా

ఒక్కరికి.. ఒకటే ఓటు
తహసీల్దార్ అజీంఅలీ



సమావేశంలో బీఎల్‌ఓలు

కేశంపేట: ఒక్కరికి ఒకటే ఓటు ఉండే విధంగా సర్వే చేసి డబుల్ ఓట్లు రద్దుచేయాలని తహసీల్దార్ అజీంఅలీ అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఓటును తనిఖీ చేయాలన్నారు. డబుల్ ఓట్లు లేకుండా మూసాయిదాను రూపొందించాలని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్, ఆర్‌ఐ నివేధిత, జూనియర్ అసిస్టెంట్ సరస్వతి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పరామర్శ



అంతిమ సంస్కారంలో కాలె యాదయ్య

శంకర్‌పల్లి: మోకిల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నయీం తండ్రి మహమద్ హుస్సేన్ అకాల మృతి చెందడంతో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వారి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, గోపాల్‌రెడ్డి, మన్నె లింగం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం లక్ష్యం
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- లబ్ధిదారుడి కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీని బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లబ్ధిదారుడికి అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన శివకేశవ్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని సర్పంచ్ లక్ష్మి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి వెంటనే సీఎం సహాయ నిధి నుంచి రూ.90వేలు మంజూరు చేయించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్‌ఓసీని ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, మోహన్‌రెడ్డి, మల్లేష్, కుమార్, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఊబగుంట గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పశువులకు టీకాలు వేయించాలన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అసెంబ్లీ కార్యదర్శిగా ఇంద్రసేన



ఇంద్రసేన

కొత్తూరు: బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ కార్యదర్శిగా పెంజర్ల గ్రామానికి చెందిన డి. ఇంద్రసేన నియమితులైనట్లు నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో భాగంగా నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ నియామకపు పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని ఇంద్రసేన తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీని వెంటనే చేపట్టాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: బీజేపీ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

షాద్‌నగర్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు తెల్లవారు జాము నుంచే బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద భారీ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి నేటికీ మాట నిలబెట్టుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల చిన్న చూపు చూడటం సరికాదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి కొత్తనాటకానికి తెరలేపిందన్నారు. షాద్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో డాక్టర్ విజయ్‌కుమార్, అందెబాబయ్య, వెంకటేష్‌గుప్తా, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేశ్, మురళీ, ప్రవీణ్, వెంకటేశ్ యాదవ్, రుషికేష్, కుర్మయ్య, నర్సింహ్మ యాదవ్, బాల్‌రాజ్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: అక్రమంగా అరెస్టులు బాధాకరమని మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్ అన్నారు. బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి సొంతపూచీకత్తు పైన విడుదల చేశారు. అనంతరం నర్సింహాయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, మండలాధ్యక్షుడు శ్రీశైలం, కుర్మయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నట్లు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం ఇన్ముల్‌నర్వ గ్రామంలో సర్పంచ్ అజయ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్ముల్‌నర్వ పంచాయతీ పరిధిలోని 7వ వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే నిధులు రూ.70 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకొచ్చిన తర్వాత పట్టణాల మాదిరిగానే మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందాయన్నారు. అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తాగునీటి కోసం గతంలో కమ్యూనిటీ కుళాయిల వద్ద మహిళలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తు చేశారు. ఇప్పుడు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికీ నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇళ్లు, ఖాళీ స్థలాలు, అంతర్గత రోడ్ల పక్కన చెత్తను పారబోయకుండా పారిశుద్ధ్య సిబ్బంది వాహనాల్లో చెత్తను సేకరించి డంపియార్డులకు తరలిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చెల్లిందన్నారు. జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, వైస్ ఎంపీపీ శోభా, ఎమ్మె సత్యనారాయణ, రషీద్, యాదగిరి, మిట్టునాయక్, శ్రీరాములు, లింగనాయక్, గోపాల్‌నాయక్, పాల్గొన్నారు.

బీసీ కులాలపై వివక్ష తగదు



శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంకర్‌పల్లి: బీసీ కులాలపై సీఎం కేసీఆర్ వివక్ష చూపుతున్నారని శంకర్‌పల్లి ముదిరాజ్ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శంకర్‌పల్లిలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 60లక్షల మంది ముదిరాజ్‌లు, గంగపుత్రులు ఉన్నారన్నారు. తమ సామాజిక వర్గానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదగకుండా అణిచి వేస్తున్నారని ఆరోపించారు. తమ సామాజిక వర్గం నుంచి పటాన్‌చెరు నియోజకవర్గంలో నీలం ముదిరాజ్‌కు, సంగారెడ్డిలో పులిమామిడి రాజు ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టికెట్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్‌ఎస్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మన్నె వెంకటేశం, మైసయ్య, శ్రీనివాస్, హరీశ్, రాఘవేందర్, మహేశ్, పాండు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం
పెద్దవేడు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్



వైద్య శిబిరంలో హాజరైన వైద్యులు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరమని పెద్దవేడు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భానూరి మమత మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం
పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



చెక్కును అందజేస్తున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని, భక్తి భావం పెంచుకోవాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం వీర్లపల్లి శంకర్ రూ. లక్ష చెక్కును దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావంతో మానసిక ఆందోళనలు కూడా దూరమవుతాయన్నారు. అదేవిధంగా సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని పేదల సంక్షేమానికి, సమాజాభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కావలి శ్రీశైలం, మల్లేశ్, అంబటి రాజు, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, గుట్ట రాజు, లతీఫ్, మాలిక్ పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి
యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య



గునుగల్ ఆదర్శ పాఠశాలలో సభ్యత్వ నమోదులో గాలయ్య తదితరులు

యాచారం: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. డీఎస్సీ ద్వారా వెంటనే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీచేయాలని వారు డిమాండ్ చేశారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా కోశాధికారి జగన్నాధం, మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, అంజయ్య, ఉపాధ్యాయులు మల్లేష్, మోతిలాల్, వెంకటేశ్, మహేశ్, రమేశ్, జగదీష్, జంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గోకుల్‌దాస్‌లే, సర్పంచ్ సమ్మి పెంటయ్య

బయోస్టేడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గోకుల్‌దాస్‌లే, సర్పంచ్ సమ్మి పెంటయ్య

షాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి రాణించాలని బయోస్టేడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గోకుల్‌దాస్‌లే, తాళ్లపల్లి సర్పంచ్ సమ్మి పెంటయ్య పేర్కొన్నారు. బుధవారం తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బయోస్టేడ్ కంపెనీ వారు ఒక్కొక్కరికి రూ.2,500ల చొప్పున 10 మందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ప్రమోజకులవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులను పోత్సహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి

బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బాధితుల వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బాధిత రైతులు

చేవెళ్ల: దామరగిద్ద సమీపంలో చేవెళ్ల బస్‌డిపో ఏర్పాటుకోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. చేవెళ్ల మండలకేంద్రంలో బుధవారం జరిగిన బీజేపీ సమావేశానికి వచ్చిన కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని దామరగిద్దలో బస్‌స్టేషన్ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన బాధిత రైతులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్‌డిపో ఏర్పాటు చేస్తామని తమ భూములను ప్రభుత్వం తీసుకొని ఆర్టీసీకి అప్పగించిందన్నారు. అప్పుడు భూములు ఇచ్చినందుకు ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఇక్కడ బస్ డిపో రాలేదు. వస్తుందో రాదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తాము డిపో ఏర్పాటునకు ఇచ్చిన భూములను తిరిగి ఇప్పించాలని బాధిత రైతులు మంత్రితో వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, పరిగి నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం

ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి టికెట్లపై ఉన్న శ్రద్ధ.. విద్యారంగ సమస్యల పరిష్కారంలో లేదని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కె. శ్రీరామ్ ప్రశ్నించారు. ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..నాలుగేండ్లుగా విద్యారంగ సమస్యలు కొకోల్లలుగా ఉన్నప్పటికీ పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో చూపడం లేదని విమర్శించారు. సంజీవరెడ్డి, జగదీశ్, సందీప్, శివ, గణేశ్, మహేందర్‌లు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయంపై సంబరాలు

బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి

చేవెళ్ల: చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరుకున్న తొలి దేశంగా భారత్ అవతరించిందని బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి అన్నారు. చంద్రయాన్-3 జాబిల్లిపై అడుగుపెట్టిన సందర్భంగా మండలకేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. చంద్రునిపై చంద్రయాన్-3 విజయవంతం అయినట్లు టీవీల ద్వారా తెలియటంతో మండలకేంద్రంలో టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. రామన్నగూడ గ్రామంలో యువకులు, విద్యార్థులు జాతీయ జెండా చేతబూని ఈ విజయాన్ని తోటివారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 140కోట్ల మంది భారతీయుల కలల్ని నిజం చేస్తూ జాబిల్లిపై అడుగుపెట్టిన చంద్రయాన్-3 విజయవంతం కావటం ఎంతో గర్వకారణమన్నారు. అనంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, ప్రవీణ్‌చారి, శివనాథ్, మైపాల్‌రెడ్డి, గణేశ్, అశోక్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



మొయినాబాద్: మల్లేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న దర్శన్

ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్

మొయినాబాద్: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ పేర్కొన్నారు. ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ సారి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ప్రజల్లో ఉండి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతీ ఇంటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ గ్రామ కమిటీ అధ్యక్షులు కుండె మల్లేశ్, ఎ.జంగయ్య, ఎండీ మినాజుద్దీన్‌లతో కమిటీ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రాములు, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించుకుందామని పీసీసీ కార్యవర్గ సభ్యులు, చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు షాబాద్ దర్శన్, జిల్లా నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం ఎన్కెపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ చందనచంద్రయ్య, గ్రామ అధ్యక్షుడు రాజేష్‌ల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి మహిళలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చిన కాంగ్రెస్ జెండా రెపరెపలాడడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని సూచించారు. తొమ్మిది సంవత్సరాల బీఆర్‌ఎస్ దోపిడీ పాలనతో ప్రజలు విసుగుపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, పీసీసీ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడు నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, జిల్లా కిసాన్‌సెల్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీరామ్‌నగర్ ఎంపీటీసీ రాంరెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కవాలి రమేశ్, అనంతరెడ్డి, భిక్షపతి, శ్రీశైలం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మె సత్తయ్య

మాదాసి కురువ సంఘం జిల్లా కన్వీనర్ ఎమ్మె సత్తయ్య

షాద్‌నగర్: ఐకమత్యంగా ఉండి హక్కులను సాధించుకోవచ్చని మాదాసి కురువ సంఘం జిల్లా కన్వీనర్ ఎమ్మె సత్తయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని భీమారం గ్రామంలో మాదారి కురువ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మె సత్తయ్య హాజరై మాట్లాడారు. హక్కుల సాధనకు అందరూ కలసికట్టుగా ఉద్యమించాలన్నారు. మాదాసి కురువలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా రంగాల్లో మరింత పురోభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం మాదాసి కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలను జారీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీని వారు ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కురువ నర్సింలు, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా కురువ చెన్నయ్య, సంయుక్త కార్యదర్శిగా సత్తయ్య, కోశాధికారిగా యాదయ్య, గౌరవాధ్యక్షుడిగా నర్సింలు, బుచ్చయ్య, సభ్యులుగా శివకుమార్, భీమయ్య, శ్రీకాంత్, చెన్నయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం తాలుకా అధ్యక్షుడు సింధం విఠలయ్య, బీరప్ప, లక్ష్మయ్య, బండల బారాజ్ తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం ఇస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లు

చేవెళ్ల: మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సంఘం జిల్లా అధ్యక్షురాలు పి భారతి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీల్లో టీచర్ ఒక్కరే ఉండటంతో ఆయా పనులతోపాటు అన్ని పనులు ఒక్కరే చేసుకోవాల్సి వస్తుందని చెప్పారు. పని భారం ఎక్కువవుతుందన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని వారు ఎమ్మెల్యేతో మొర పెట్టుకున్నారు. జిల్లాలో ఉన్న మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా గుర్తించాలని వారు కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తమకు న్యాయం జరగుతుందనే నమ్మకం ఉందని ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకపోయి సమస్యలు పరిష్కరించాలని మినీ అంగన్‌వాడీలు ఎమ్మెల్యేతో చెప్పారు. చేవెళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీలు సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి సమావేశ మందిరం లేదని దీంతో ప్రతినెలా జరిగే రెండు సమావేశాలకు తాము హాజరవుతూ ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యేతో చెప్పారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సమావేశ మందిర నిర్మాణాకి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం కన్నగూడ వినోద, కృష్ణవేణి, వినోద, అండాలు తదితరులు పాల్గొన్నారు.